క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప లోని క్యూర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పోరుమామిళ్ల లోని నాగేంద్ర హాస్పిటల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కీళ్ల, ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ కె. పార్థసారథి తెలిపారు. శనివారం నగరంలోని నాగరాజు పేట లో ఉన్న క్యూర్ హాస్పిటల్స్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య శిబిరంలో తనతో పాటు జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ వై.చంద్రమౌళి విచ్చేసి రోగులను ఉచితంగా పరీక్షిస్తామన్నారు. కీళ్లు, ఎముకలు, నరాలు, వెన్నెముక, మెడ, నడుము, మోకాళ్ళు, భుజం నొప్పులతో ఇబ్బంది పడుతున్న వారు శిబిరానికి విచ్చేసి చికిత్స పొందాలన్నారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, గుండె నొప్పి తదితర సమస్యలున్నవారు రావాలన్నారు. పేర్ల నమోదుకు 9553102102 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

న్యాయం చేయాలి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులకు న్యాయం చేయాలని ఏపీ వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హిరామియ్యా కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులుగా చేరి వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులుగా నియమించబడి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జీవో నంబర్ 423 ద్వారా తమకు అన్యాయం జరిగిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు అందరికీ జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపచేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కడప ఎడ్యుకేషన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కడప టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు లయన్ ఖాదర్‌బాష కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం కడప మోచంపేటలోని సచివాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణల్లో, ఖాళీ స్థలాలు, కార్యాలయ ఆవరణాల్లో మొక్కలను పెంచాలని సూచించారు. కడపను గ్రీన్ కడపగా మార్చేందుకు ప్రతి ఒక్కరు నడుంబిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు ఆరీఫ్, 39వ డివిజన్ వాసులు గౌస్‌పీర్, అబ్దుల్లా, అల్లాబకాస్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పుస్తకాలను వెంటనే సరఫరా చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభమై పది రోజులు అయినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఉర్దూ మాధ్యమ పాఠ్య పుస్తకాలు అందలేదని, రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ వెంటనే చర్యలు తీసుకుని పుస్తకాలు అందజేయాలని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, జిల్లా అధ్యక్షుడు నజీర్‌బాషా కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు జమ చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయా లని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి కోరారు. శనివారం నగరంలోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరు ల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రా రంభమైందని ఈ ఖరీఫ్ లో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడు తోందని అన్నారు. ఎన్నికల ముందు టీడీపీ కూటమి ప్రకటించిన పెట్టుబడి సహాయం కింద ఇస్తామన్న రూ.20 వేలను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయా లని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కళాశాలలకు మౌలిక వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కడపజిల్లా ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శి చెప్పలి రాజారావు కోరారు. ఇంటర్మీడియట్ బోర్డు నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నిధి మీనాకు ఆయన జిల్లా ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం తరుపున శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేసి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ప్రతి కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది కొరత లేకుండా చూడాలని అభ్యర్థించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో పార్థసారథి తెలిపారు. పథకం ద్వారా మామిడి, చీనీ, సన్ననిమ్మ, సపోటా, జామ, సీతాఫలం వంటి పండ్ల తోటలు పెంచుకోవచ్చని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి వున్న చిన్న, సన్నకారు రైతులు తమ భూమి వన్‌బీ, అడంగల్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకుని ఫీల్డ్ అసిస్టెంట్‌ను గానీ లేదా ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు కృషి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో ఇంజినీరింగ్, మెడికల్, శానిటేషన్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు డయేరియా, మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువల్లో తాగునీటి పైపులు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, బండి కనుమ, లింగంపల్లి, గండి పంప్‌హౌస్‌ల వద్దనున్న ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. నీటిని నింపిన తర్వాత క్లోరినేషన్ చేయించాలన్నారు. అమృత్ ఒకటవ దశలో ఏర్పాటు చేసిన ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను ఉపయోగంలోకి తేవాలన్నారు. ఆ ట్యాంకులను పదిహేను రోజులకు ఒకసారి శుభ్రం చేసేలా చూడాలని, శుభ్రం చేయు తేదీలను నమోదు చేయాలన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద క్లోరినేషన్ చేసేందుకు కాంట్రాక్టర్‌కు నోటీస్ ఇవ్వాలన్నారు. ఎన్ని కాలువల్లో పూడిక తీయాలో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రజలు డయేరియా బారిన పడకుండా యూపీహెచ్‌సీ డాక్టర్లు కృషి చేయాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మందులను స్టాక్ ఉంచుకోవాలన్నారు. డయేరియా ఎక్కువగా చిన్నపిల్లలకు సోకే అవకాశం ఉన్నందున అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీ స్త్రీలు, మహిళలతో సమావేశం ఏర్పాటు చేసుకొని హ్యాండ్ వాష్ విధానం గూర్చి అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న వాటర్ ట్యాంకులు క్లీన్ చేసి బ్లీచింగ్ వేసి అనంతరం నీరు నింపాలని సూచించారు. అన్ని స్కూళ్లలో ఉన్న వాటర్ ట్యాంకులు, టాయ్‌లెట్లు శుభ్రం చేయించాలన్నారు. మురికి వాడల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని, నగరంలోని అన్ని హోటళ్లు పరిశుభ్రంగా ఆహార పదార్థాలు తయారు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, ఈఈలు నారాయణస్వామి, ధనలక్ష్మి, డీఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నిరంతర సత్య స్వాప్నికుడు రమణారెడ్డి

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, తదితరులు

కడప కల్చరల్ : భగవంతుడు, ఓంకారం, ఆత్మ, ప్రజ్ఞానం, పరమాత్మ వంటి ఆధ్యాత్మిక పదాలకు కొత్త నిర్వచనం చెప్పిన విద్వాన్ కె.వి. రమణారెడ్డి నిరంతర సత్య స్వాప్నికుడని వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కడప సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో శనివారం కె.వి. రమణారెడ్డి రచించిన 'ప్రజ్ఞాన ప్రకాశిక' పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించి మాట్లాడారు. రమణారెడ్డి రచనలు అయన జ్ఞాన పరిణితికి నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. సభాధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, విశిష్ట అతిథి ఆచార్య శివారెడ్డి మాట్లాడుతూ ఉపనిషత్తుల మహత్తర తాత్విక వారసత్వాన్ని మానవాళి జీర్ణించుకుని, ఆదరించి, ఆచరించి ఉన్నట్లయితే మానవ జీవితం ధన్యమయ్యేదని రమణారెడ్డి చెప్పిన మాటలు అక్షర సత్యాలన్నారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ మనిషి ఆలోచన ఎలా ఉండాలో చెబుతూ ప్రకృతి ధర్మాన్ని రక్షిస్తుందని తెలుసుకోవడమే ప్రజ్ఞానం అనడం ఆయన సునిశిత దృష్టికి నిదర్శమన్నారు. గజ్జల అశోక్ రెడ్డి గీర్వాణితిలకం గీతాంజలి పుస్తకాన్ని పరిచయం చేస్తూ ప్రకృతికి భారతీయ తాత్విక అంశాలకు అనుసంధానం చేయడం ఆయన ప్రతిభకు నిదర్శమన్నారు. ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి, లయన్ కె. చిన్నప రెడ్డి మాట్లాడారు. డా. భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా. చింతకుంట శివారెడ్డి సభను పర్యవేక్షించారు. అతిథులను, రచయిత రమణారెడ్డి దంపతులను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి శంకర్, ఎ. రామాంజుల రెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, డా. వెల్లాల వేంకటేశ్వరాచారి, భూపతి రాయల్ పాల్గొన్నారు.

భూసార పరీక్షతో ప్రయోజనాలు

కమలాపురం : రైతులు భూసార పరీక్షలను చేయించుకోవడం వలన అనేక ప్రయోజనాలు వున్నాయని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని విభరాపురం గ్రామంలో భూసార పరీక్షల నిర్వహణలో భాగంగా రైతుల పొలాల్లో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన మట్టి నమూనాల సేకరణ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. మట్టి నమూనా తీయు విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల వలన భూమిలోని పోషకాల మోతాదును తెలుసుకోవచ్చని, దాని ద్వారా ఎంత మేర అసరమో అంత మేరకే ఎరువులను ఉపయోగించి సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలపారు. నేల స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా ఆ నేలకు అనువైన పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆమ్ల నేలలు, క్షార నేలలను గుర్తించి తమకు అనువైన విధంగా మార్చుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం మండలంలో 520, వల్లూరు మండలంలో 460, వీరపునాయునిపల్లె మండలంలో 670, ఎర్రగుంట్ల మండలంలో 530 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్‌బీకేల సిబ్బంది లక్ష్యాల మేరకు రైతుల నుంచి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షా కేంద్రాలకు పంపాలన్నారు. సమస్యాత్మక నేలలను గుర్తించి వాటిపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మట్టి నమూనాలు సేకరించాలన్నారు. రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి మట్టి నమూనాలను తీయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో దస్తగిరి, వ్యవసాయ సహాయకుడు వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

కమలాపురం : ప్రొద్దుటూరు పట్టణం పవర్ హౌస్ రోడ్డులోని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందని కమలాపురం విద్యుత్ శాఖ ఏఈ చాంద్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నిర్వహిస్తున్న ఈ విద్యుత్ అదాలత్‌ను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జమ్మలమడుగు : ఈనెల 24వ తేదీ సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలోని పవర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ రాజాబాబు శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు.

వసతులు లేని కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో కనీస మౌలిక వసతులు లేని కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, నాగరాజులు కోరారు. ఈ విషయమై శనివారం ఆర్‌ఐవో వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో ఓ ప్రైవేటు కళాశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి కళాశాలను నిర్వహిస్తున్నారన్నారు. కళాశాలలో ఎటువంటి ప్రాక్టికల్ ల్యాబులు కానీ, సరైన మరుగుదొడ్లుకానీ, సరిపడా తరగతి గదులుకానీ లేవని ఆరోపించారు. పిల్లల దగ్గర నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ కూడా వారికి సరైన సౌకర్యాలను కల్పించడంలో వారు విఫలమయ్యారన్నారు. ఈ విషయంలో ఇంటర్ విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచి పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం వేదపండితులతో ఘనంగా నిర్వహించినట్లు శనివారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కన్యతీర్థ క్షేత్రంలో వెలసిన మహాత్రిపుర సుందరీదేవి అమ్మవారిని జేష్ట శుద్ధపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

కమనీయం.. కల్యాణం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ సత్యనారాయణస్వామి

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం 59వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కమీనయంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మినారాయణ, సుదర్శన హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ సత్యనారాయణ స్వామిలను వధూవరులుగా అలంకరించి కళ్యాణం వైభవంగా చేపట్టారు. తర్వాత స్వామి, అమ్మవార్లలను రథంపై కొలువు దీర్చి ఊరేగించారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో పౌర్ణమి పూజలు


చండీయాగంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన తొమ్మిది కలశాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది దంపతులు ఇతర భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మూలమూర్తికి కలశాలలోని పవిత్ర జలంతో ప్రత్యేకంగా నవకలశ స్నపనం నిర్వహించారు. చండీహోమం నిర్వహించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 108 దీపాలను వెలిగించి అష్టోత్తర శతదీపాలంకార సేవ నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

నూతన ఆవిష్కరణలకు నాయకులుగా ఎదగాలి


ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థికి పట్టా అందజేస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్

కడప ఎడ్యుకేషన్ : నేడు ఇంజనీరింగ్ పట్టా పొందిన విద్యార్థులు రేపటి ప్రపంచ నూతన ఆవిష్కరణలకు నాయకులుగా ఎదగాలని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ జీవీఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 2020-24 బ్యాచ్‌లో వివిధ బ్రాంచులలో విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు 7వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని కేఓఆర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను, ప్రశంసా పత్రాలను అందచేశారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మీ జీవితాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నామిని ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరస్వామి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన శ్రీభీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారికి గణపతి పూజ, అభిషేకాలకరణ, పంచామృతాభిషకం, ఆకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి కాయ కర్పూరాలతో మొక్కులు తీర్చుకున్నారు. అలాగే 10.30 గంటల నుంచి 12.00 గంటల వరకు శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని కన్నులారా తిలకించారు. భక్తులకు ఆలయ ఆవరణలో దాతలు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు.

వైఎస్ జగన్‌కు అడుగడుగునా ఘన స్వాగతం


ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వేంపల్లె : తాడేపల్లిలోని తన నివాసం నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రత్యేక విమానంలో కడప ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన పులివెందులకు బయలు దేరారు. ఈ నేపథ్యంలో కడప పులివెందుల బైపాస్‌లోని వేంపల్లె హనుమాన్ జంక్షన్ వద్ద వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఎంపీటీసీ భారతి హారతులు పట్టారు. అలాగే బైపాస్‌లోని ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద, రాజీవ్‌కాలనీ వద్ద కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ అభివాదం చేస్తూ ఎవరూ అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులకు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కడప విమానాశ్రయం నుంచి పులివెందులకు రోడ్డు మార్గాన బయలుదేరిన జగన్‌ను పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రి, నల్లయ్యగారిపల్లె, నందిమండలం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయన.. నాయకులు, కార్యకర్తలను పలకరించి ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు.

వేములలో..

వేముల : వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ మరక శివకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కార్యకర్తలు కలిశారు. కడప నుంచి రోడ్డు మార్గాన పులివెందులకు వెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేములలో కొద్దిసేపు ఆగారు. అనంతరం కార్యకర్తలు జగన్‌ను కలిశారు. అక్కడి నుంచి ఆయన పులివెందులకు బయలుదేరి వెళ్లారు.

పెరుగుతున్న అరటి సాగు విస్తీర్ణం

- పులివెందుల నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.60 వేలుపైనే పెట్టుబడులు
- 8 నుంచి 12 టన్నుల మేర దిగుబడులు


అరటిమొక్కలను కాపాడుకునేందుకు రక్షణగా పెట్టిన ఈతాకులు


సాగులో ఉన్న అరటి పంట

వేముల : నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది అరటి సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో అత్యధికంగా అరటి సాగవుతోంది. ఏడాదికి ఏడాది అరటి సాగు విస్తీర్ణం పెరుగుతూ ఈ ఏడు 15 శాతం మేర విస్తీర్ణం పెరిగిందని ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు. ఇందుకు ఒకేరకమైన పంటలు సాగుచేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోయి నష్టపోతున్న రైతులు అరటిసాగుకు ఆసక్తి కనపరుస్తున్నారు. అరటిసాగు చేసే రైతులు పొలాలను ముందుగానే దుక్కులు చేసి పశువుల ఎరువులు వేసి సాగుకు సిద్ధం చేస్తారు. అరటిసాగులో ఆదాయం ఉండటంతో రైతులు ఆదిశగా దృష్టి సారిస్తున్నారు.

నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో సాగు

పులివెందుల నియోజకవర్గంలో అరటిపంట ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు అరటి సాగు చేస్తున్నారు. ఒకసారి అరటి సాగుచేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లె మండలాల్లో అరటి సాగుచేస్తారు. మే, జూన్, జూలై నెలల్లో ఎక్కువగా అరటిని సాగుచేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతినకుండా ముందుగానే దిగుబడులు వచ్చేలా రైతులు అరటిపై దృష్టిపెడుతున్నారు.

వేసవిలో అరటిని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు

అరటిపంట సాగు చేసే సమయంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. అరటి మొక్కలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు అన్నిఇన్నీ కావు. నాటిన అరటి మొక్కలను బ్రతికించుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు. అరటి మొక్కలకు ఈత ఆకులను రక్షణగా చేసి ఉష్ణోగ్రతల నుంచి రక్షించుకుంటున్నారు. ఇందుకోసం అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. నెలరోజుల పాటు అరటిపంటలను రక్షించుకోవాల్సి వస్తుందని లేదంటే మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.60 వేలకు పైనే పెట్టుబడులు

అరటి సాగులో పెట్టుబడులు ఎక్కువగా అవుతున్నాయి. ఎకరాకు రూ.60 వేలకు పైనే పెట్టుబడులు పెడుతున్నామని రైతులు అంటున్నారు. ఎకరాకు 1200 మొక్కలను నాటుతున్నారు. ఎక్కువగా జెయిన్, క్యాడిల్లా, మైక్రోనస్, ఎక్స్ఎల్, విట్రో, కెఫ్‌బయోటెక్‌రీటా కంపెనీలకు చెందిన గ్రాండ్ 9 యాలకి అనే అరటి రకాలను ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఒక్కో మొక్కను రూ.12 లతో కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. అరటి మొక్కలు నాటిన మొదలు సస్యరక్షణ చేపడుతూ మొక్కలను కాపాడుకుంటున్నారు. అంతేకాక కలుపుతీయడం, సేద్యాలు, కూలీఖర్చులు, ఎరువులు, తదితర వాటి కోసం అదనపు ఖర్చులు కావడంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడులు

అరటిసాగులో దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటున్నాయి. ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడులు అందుతున్నాయి. సాగుచేసిన 10 నెలల తర్వాత దిగుబడులు వస్తున్నాయి. దిగుబడులు అందే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో ఎక్కడ తోటలు దెబ్బతింటాయోనని రైతులలో ఆందోళన ఉంటోంది. తోటలలో అరటిగెలలు కోతకోసే వరకు రైతులకు కంటిమీద కునుకు ఉండదు. ఇన్ని ఆటుపోట్ల నుంచి బయటపడితేనే అరటిలో ఆదాయం ఉంటుందని, లేదంటే పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఉంటుందని రైతులు అంటున్నారు.


సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్న అరటి మొక్కలు

5 ఎకరాల్లో అరటి సాగుచేసా



నాకున్న 5 ఎకరాల్లో అరటిని సాగుచేసా. సాగుకు రూ.3 లక్షలు పైనే పెట్టుబడి పెట్టా. ఒక్కో మొక్కను రూ.12లతో కొనుగోలు చేసి ఎకరాకు 1200 మొక్కల చొప్పున నాటా. దిగుబడులు వచ్చేవరకు సకాలంలో మందులను పిచికారీ చేసి నీటితడులు అందిస్తున్నా. దిగుబడులు పెరుగుతున్నా ఆదాయం ఉంటుందన్న ఆశతో సాగుచేశాం. మార్కెట్‌లో ధరలు బాగా ఉంటే ఆదాయం ఉంటుందని ఆశతో ఉన్నాం.

- శివశంకర్‌రెడ్డి, అరటి రైతు, మబ్బుచింతలపల్లె

అరటిసాగుపై రైతులు ఆసక్తి



గత రెండేళ్లుగా అరటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండటం, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో అరటిసాగు విస్తీర్ణం పెరుగుతోంది. చనిపోయిన చీనీచెట్ల స్థానంలో పంట మార్పిడి కోసం రైతులు అరటిని సాగుచేస్తున్నారు. ఒకసారి సాగుచేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు ఆదిశగా అరటికి మొగ్గుచూపుతున్నారు.

- జి.రాఘువేంద్రారెడ్డి, హెచ్‌ఓ, పులివెందుల

ప్రతి సోమవారం ఫిర్యాదు చేసుకోవచ్చు

చెన్నూరు జూన్ 22 : ప్రతి సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదులను అధికారులు స్వీకరించి పరిష్కరిస్తారని తహసీల్దార్ ప్రకాష్ బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు 24వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తారని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

పంట రుణాలను రెన్యూవల్ చేసుకోండి

పెండ్లిమర్రి : వెల్లటూరు సొసైటీలో పంట రుణాలు తీసుకున్న రైతులు గడువులోపు పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యూవల్‌కు వచ్చే రైతులు వన్‌బీ, ఆధార్‌కార్డు, పాసుపుస్తకం జిరాక్స్‌లు తీసుకునిరావాలన్నారు. అలాగే దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు కంతులు చెల్లించాలని ఆయన కోరారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

కమలాపురం : ఇటీవల విడుదలైన నీట్ పరీక్షా ఫలితాలు దేశంలోని విద్యార్థులందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయని, పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ కమలాపురం మండల నాయకులు సిద్ధార్థ అన్నారు. శనివారం కమలాపురంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 68 మంది విద్యార్థులు మొదటి ర్యాంకు పొందడం, గ్రేస్ మార్కులు ఇంప్లిమెంట్ చేయడం, జూన్ 14న విడుదల చేయాల్సిన నీట్ పరీక్షా ఫలితాలను జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ రోజు విడుదల చేయడం వంటి అంశాలు పరీక్ష నిర్వహణలో అనేక సందేహాలకు అద్దం పడుతున్నాయన్నారు. పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. పరీక్ష నిర్వహిస్తున్న ఎన్టీఏను రద్దు చేసి వైద్య విద్య సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.